సాక్షి అన్నమయ్య జిల్లా

మంగళవారం । 11 । ఫిబ్రవరి । 2025



తిరుపతి నుంచి షిర్డీకి రైలు సౌకర్యం కల్పించాలి

ప్రజల సౌకర్యం కోసం తిరుపతి-షిర్డీకి నేరుగా రైలు సౌకర్యం కల్పించాలని ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి సోమవారం కేంద్ర మంత్రిని కోరారు. - 8లో



రైతుపై కక్ష.. పంటపై తీర్చుకున్నారు

ఓ రైతుపై కక్షతో.. ఆయన పంటను కొందరు గుర్తు తెలియని దుండగులు నాశనం చేశారు. ఈ సంఘటన రాయచోటి మండలం మాసాపేట పాతగొల్లపల్లిలో జరిగింది. - 8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.160	రూ.200
రెండోరకం	రూ.100	రూ.150

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 48 మెట్రిక్ టన్నులు



న్యూస్‌రీల్

ఉపాధిలో రూ. 1.90 లక్షల అవినీతి

– ఐదుగురు సిబ్బందిపై సస్పెన్షన్ వేటు



సామాజిక బహిరంగ సభలో పీడీ వెంకటరత్నం

కేవీపల్లె : మండలంలో 2023 ఏప్రిల్ 1 నుంచి 2024 మార్చి 31వ తేదీ వరకు జరిగిన జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనుల్లో రూ.1.90 లక్షల అవినీతి జరిగినట్లు పీడీ వెంకటరత్నం తెలిపారు. సోమవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయం వద్ద సామాజిక తనిఖీ బహిరంగ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ ఏడాది కాలానికి జరిగిన ఉపాధి సామాజిక తనిఖీలో అవినీతి వెలికి తీసినట్లు తెలిపారు. రూ. 1,90,191 అవినీతి జరిగినట్లు గుర్తించామని చెప్పారు. అవినీతికి పాల్పడ్డ జేఈ రమణ, టెక్నికల్ అసిస్టెంట్లు సుధాకర్, శివ, దీపతోపాటు గాలివారిపల్లె, గ్యారంపల్లె, ఎంపీపల్లె ఫీల్డ్ అసిస్టెంట్‌లపై సస్పెన్షన్ వేటు వేసినట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఏపీడీ శ్రీనివాసులు, ఎంపీడీవో సుధాకర్, ఎంపీపీ ఈశ్వరమ్మ, ఏపీవో నాగరాజ తదితరులు పాల్గొన్నారు.

తేరుపై వేంకటరమణస్వామి ఊరేగింపు



తేరుపై ప్రత్యేక అలంకరణలో స్వామి

తంబళ్లపల్లె : మండలంలోని కోసువారిపల్లెలో వెలసిన శ్రీ ప్రసన్న వేంకటరమణస్వామి ఆలయంలో ఎనిమిది రోజులుగా టీటీడీ ఆధ్వర్యంలో స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. సోమవారం టీటీడీ ఆగమ సలహాదారులు శ్రీనివాసచార్యులు, అర్చకులు కృష్ణప్రసాద్‌భట్టార్, రమేష్‌బాబు, ధనుష్, క్రిష్ణమూర్తిలు స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సంప్రదాయబద్ధంగా తేరుపై శ్రీదేవి, భూదేవి సమేత వెంకటరమణస్వామిని ప్రత్యేక అలంకరణ చేశారు. ఊరేగింపు నిర్వహించారు. భక్తులు తేరుపై స్వామిని దర్శించుకుని పరవశించిపోయారు. రాత్రి గజవాహనంపై స్వామి ఊరేగింపు నిర్వహించారు. టీటీడీ ధర్మ ప్రచారపరిషత్ ఆధ్వర్యంలో హరికథా, కళాకారులచే ప్రదర్శించిన పలురకాల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో డిప్యూటీ ఈఓ గోపినాథ్, ఆలయ ఇన్‌స్పెక్టర్ ధుషంత్‌కుమార్, నగేష్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమి యథేచ్ఛగా కబ్జా



మాట్లాడుతున్న నల్లారి తిమ్మారెడ్డి

కలికిరి : మండలంలోని పత్తేగడ, మర్రికుంటపల్లి గ్రామ పంచాయతీల్లో ప్రభుత్వ ఆస్తులు యథేచ్ఛగా కబ్జాకు గురవుతున్నాయని మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ నల్లారి తిమ్మారెడ్డి ఆరోపించారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో సోమవారం ఆయన మాట్లాడారు. పత్తేగడ గ్రామ పరిధిలోని సర్వే నంబర్: 288లో గల గుట్ట, దీని పక్కనే మర్రికుంటపల్లి గ్రామంలోని సర్వే నంబర్:600/3లోని గుట్ట స్థానికంగా రైతులకు, గొర్రెలు, పశువుల మేతకు అనుకూలంగా ఉందన్నారు. గుట్ట వద్దనే అక్కగార్ల గుడి, సాయిబాబా ఆలయం, శివాలయం ఉన్నాయని పేర్కొన్నారు. ప్రస్తుతం కబ్జాదారుల కన్ను గుట్టపై పడిందన్నారు. జేసీబీల సాయంతో గుట్టలో మట్టిని తరలిస్తూ చదును చేస్తున్నారన్నారు. సర్వే నంబర్ : 600/3కు సంబంధించి హైకోర్టులో దావా ఉన్నా కూడా కబ్జాదారులు లెక్కచేయకుండా ఆక్రమణకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. అలాగే పత్తేగడ గ్రామంలోని సర్వే నంబర్ 296లో ఎకరం 25 సెంట్లు విస్తీర్ణం గల బందవారికుంట, మర్రికుంటపల్లి గ్రామంలోని సర్వే నంబర్ 804గా గల అంకాళమ్మ చెరువులను కబ్జాదారులు చెరబట్టి పూర్తిగా పూడ్చివేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చెరువులకు వర్షపు నీరు చేరడం కోసం ఏర్పాటు చేసిన కాలువలను కూడా వదలడం లేదన్నారు. విచ్చలవిడిగా ఆక్రమణలు జరుగుతున్నా రెవెన్యూ అధికారులు కన్నెత్తి చూడక పోవడం పలు విమర్శలకు దారితీస్తోందన్నారు. ప్రజలలో రెవెన్యూ శాఖపై నమ్మకం రానురానూ సన్నగిల్లుతోందన్నారు. ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు స్పందించి ఆక్రమణదారులపై చర్యలు తీసుకుని, ప్రభుత్వ ఆస్తులు అన్యాక్రాంతం కాకుండా కాపాడాల్సి ఉందని ఆయన కోరారు.

లంకమల అరణ్యం.. వర్ధిల్లిన శైవం

- కొండూరు బీటులో పదికిపైగా శివాలయాలు
- ఆలయాల పక్కనే వెలుగులోకి వచ్చిన గుహలు
- 4వ శతాబ్దిలో శైవం వర్ధిల్లిన ఆనవాళ్లు
- పక్కనే రాతిబండపై ఆయుధాల గుర్తులు
- ఇక్కడే శివుని పాదముద్రలు, బండపై శాసనాలు
- ఈ ప్రాంతమే కైలాసకోనగా ప్రాచుర్యం



ఆలయాల పక్కనే బండపై నాటి ఆయుధాల ఆకృతి



శివాలయ శిథిల గోడ, పేర్చిన బండరాయి



బి.కొత్తకోట : జిల్లాలోని రాజంపేట నియోజకవర్గం సిద్దవటం అటవీ ప్రాంతమైన లంకమల అభయారణ్యంలో 4వ శతాబ్ది నాటి మానవుల ఆనవాళ్లు వెలుగులోకి వచ్చాక.. ఈ ప్రాంతంలో ఇంకా ఎలాంటి విశేషాలు, చరిత్ర దాగున్నాయన్న ఉత్సుకత పెరుగుతోంది. దీనికి తగ్గట్టుగా రోజుకో కొత్త విషయం బయటికి వస్తోంది. కొత్తగా సిద్దవటం అటవీశాఖ క్షేత్రాధికారిణి బి.కళావతి.. వెలుగులోకి తెచ్చిన ఫొటోల ఆధారంగా మరిన్ని విషయాలు బాహ్య ప్రపంచంలోకి వచ్చాయి. సాక్షిలో 'ఆధ్యాత్మిక క్షేత్రం.. లంకమల' కథనం ద్వారా పలు ఆసక్తికర అంశాలను వెలుగులోకి తేవడం తెలిసిందే. ప్రస్తుతం ఆ కథనానికి మరింత బలం చేకూర్చే మరిన్ని ఆధారాలు లభ్యమయ్యాయి. ఒకే చోట గుహ, బండపై శాసనం, శిథిలమైన శివాలయాల ఆనవాళ్లు, శివుని పాదముద్రలు, అక్కడే పైనుంచి కిందికి దూమికే జలపాతం.. ఇలా అన్నీ ఆధారాలు వెలుగులోకి వచ్చిన ఈ ప్రాంతానికి కైలాసకోనగా ప్రాచుర్యం ఉంది. అంటే శివుడు నివసించిన ప్రాంతమని అర్థం. కాబట్టి శైవం ఏ స్థాయిలో ఇక్కడ వర్ధిల్లిందో దీన్ని బట్టి స్పష్టంగా అర్థమవుతోంది. అందిన ఆధారాలను పురావస్తు శాఖ క్షుణ్ణంగా పరిశీలిస్తోంది.

బండలపై ఆధారాలు


ఈ ప్రాంతంలో శైవ క్షేత్రం వర్ధిల్లిందని.. ఆనాటి శైవులు బండలపై శాసనాలు, ఇతర గీతల ద్వారా వెల్లడవుతోంది. శాసనాలను బట్టి 4వ శతాబ్దినాటి శైవులు ఇక్కడ ఉన్నట్టు నిర్ధారిస్తున్నారు. అప్పట్లో ఎలాంటి ఆయుధాలు వినియోగించారో.. తెలిపేలా బండలపై వాటి ఆకృతి తెలిపేలా చెక్కారు. మరోచోట శాసనం, పక్కనే శివలింగ ఆకారం ఉన్నాయి. ఇక్కడి శిథిల ఆలయాల నిర్మాణం కోసం చతురస్రాకారంలో ఉండే బండలను వినియోగించారని, వాటిని బట్టి స్పష్టం అవుతోంది.

జలపాతం


శైవ క్షేత్రాలున్నట్టు గుర్తించిన ప్రాంతానికి సమీపంలోనే పై కైలాసకోన ఉంది. ఇది అద్భుతమైన జలపాతం. పై నుంచి జలపాతం కిందకు దూకే ప్రాంతం అత్యంత భయంకరంగా కనిపిస్తుంది. కొండనడుమ దూకే జలపాత ప్రాంతం ప్రకృతి సౌందర్యాన్ని తలపిస్తుంది. ఈ జలపాతంపై నుంచి కిందకు జారితే దిగువ కైలాసానికి చేరినట్టే. అందుకనే దీన్ని పై కైలాసంగా ప్రాచుర్యంలో ఉంది. జలపాతం దిగువన గుహలు, ఆలయాలతో కూడిన ప్రదేశమే దిగువ కైలాసకోన.

అక్కడే గుహ.. ఆలయాలు

లంకమల మొత్తం 36 వేల హెక్టార్ల మేర విస్తరించి ఉండగా.. అందులో సిద్దవటం రేంజి పరిధిలో 26 వేల హెక్టార్ల అభయారణ్యం ఉంది. అడవిలోని కొండూరు బీటులో శైవ క్షేత్ర ఆనవాళ్లు విస్తృతంగా లభ్యమయ్యాయి. దిగువ కైలాసకోనగా పిలువబడే.. ఈ ప్రదేశంలో అర ఎకరం విస్తీర్ణంలో పదికిపైగా శివాలయాల శిథిలాలు ఉన్నాయి. వీటికి సంబంధించిన పునాదుల బండరాళ్లు, వాటి నిర్మాణం కనిపిస్తున్నాయి. పడిపోయిన గోడలు, వాటి శిథిలాలు ఉన్నాయి. దీన్ని ఆధారంగా చేసుకుంటే వాటిని ఆలయాలుగా భావిస్తున్నారు. ఈ చోటనే గుహను కూడా గుర్తించారు. ఆలయాల వద్ద పూజల నిర్వహణ, గుహలో సిద్ధులు, యోగులు తపస్సు చేసుకునే వారు. ఇక్కడే శివుడ్ని ఆరాధిస్తున్న వీరుడి విగ్రహం లభ్యమైంది. ఈ ప్రాంతం దిగువ కైలాసకోనగా ఇప్పటికీ ప్రాచుర్యంలో ఉంది. ఈ అడవికి సమీపంలో సిద్దవటం గ్రామం ఉంది. అంటే సిద్ధులకు ఈ ప్రాంతం నివాసమని భావిస్తున్నారు. దీనివల్లె సిద్దవటం అని పేరొచ్చిందని చెబుతారు.



కొండూరు బీటులో గుహ



అద్భుత జలపాతం

13న జాబ్‌మేళా

కడప ఎడ్యుకేషన్ : కడప నగరంలోని ప్రభుత్వ పురుషుల కళాశాల (స్వయం ప్రతిపత్తి)లో జవహర్ నాలెడ్జ్ సెంటర్ ఆధ్వర్యంలో ఈ నెల 13న గురువారం జాబ్ మేళా నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి. రవీంద్రనాథ్ తెలిపారు. ఐటీఐ ఫిట్టర్, ఇంటర్, డిగ్రీ, బీటెక్, మాస్టర్ డిగ్రీతోపాటు డిగ్రీ ఫైనల్ ఇయర్ చదువుతున్న విద్యార్థులు అర్హులని పేర్కొన్నారు. వివరాలకు 9347256400, 9390052901 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

కరుణచూపే తల్లి లూర్దుమాత

కడప కల్చరల్ : లూర్దుమాత కరుణచూపే తల్లి అని, దేవుని ఆజ్ఞ మేరకు కరుణామయుడైన క్రీస్తును ఈ లోకానికి అందించిన మహోన్నతమైన మాతృమూర్తి అని రెవరెండ్ ఫాదర్ కాసు లూర్దు పేర్కొన్నారు. స్థానిక మరియాపురం లూర్దుమాత తిరుణాల ఉత్సవాలలో భాగంగా సోమవారం కడప నగరంలోని డాన్‌బాస్కో ఐటీఐ వద్ద నుంచి లూర్దుమాత ఊరేగింపు నిర్వహించారు. తొలుత చర్చిలో ప్రార్థనలు చేశారు. అనంతరం పూలు, రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించిన తేరుపై మరియమాతను కొలువుదీర్చారు. గురువుల దివ్యబలిపూజ అనంతరం ఆయన మాట్లాడుతూ మరియమాతకు లూర్దుమాతగా పేరు ఎలా వచ్చిందో వివరించారు. డాన్‌బాస్కో గురువులు దివ్య బలిపూజ నిర్వహించారు. కోయర్ బృందం స్తుతి గీతాలను ఆలపించారు. అనంతరం మరియమాత ఊరేగింపును ప్రారంభించారు. రెవరెండ్ ఫాదర్ తలారి బాలరాజు పాల్గొన్నారు.

తిరునాల సందడి

మరియాపురం పాత చర్చి ఆవరణలో సోమవారం నాటికే తిరునాల సందడి నెలకొంది. చర్చి ప్రాంగణంలో దుకాణాలు, రంగుల రాట్నాలు, పలురకాల ఆటవస్తువులు తదితరాలను ఏర్పాటు చేశారు. మంగళవారం ఈ ప్రాంగణంలో తిరునాల జరగనుంది. మధ్యాహ్నం 2.30 గంటలకు బండలాగుడు పోటీలు నిర్వహిస్తారు. తిరునాల సందర్భంగా నిర్వహించే పలు పోటీలలో విజేతలకు బహుమతులను అందజేస్తారు.

తప్పుడు రాతలు రాస్తే విశ్వసనీయత కోల్పోతారు

ఈనాడు వార్తలపై కొరముట్ల ఆగ్రహం



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కొరముట్ల

రైల్వేకోడూరు అర్బన్ : తప్పుడు వార్తలు రాసే పత్రికలు ప్రజల్లో విశ్వసనీయత కోల్పోతాయని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు అన్నారు. స్థానికంగా ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడారు. ఈనాడు పత్రిక పెద్దిరెడ్డి కుటుంబాన్నే లక్ష్యంగా చేసుకుని అసత్యాలు ప్రచారం చేస్తోందని విమర్శించారు. సీఎం చంద్రబాబు నాయుడు డైరెక్షన్‌లో పచ్చ ముసుగువేసుకొని ఆ పత్రిక పని చేస్తోందని మండిపడ్డారు. మదనపల్లి, పుంగనూరు, మంగళగిరిలో భూ ఆక్రమణలు అంటూ తప్పుడు కథనాలు రాస్తోందని పేర్కొన్నారు. మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డిలు ప్రజా సమస్యలపై గళమెత్తుతూ వైఎస్సార్ కుటుంబానికి అండగా ఉంటుండటం వల్లే.. ఇవన్నీ చేస్తున్నారని విమర్శించారు. దేనినీ నిగ్గు తేల్చకుండా కేవలం మసిపూసి, గుడ్డ నెత్తిన వేసే విధంగా చేస్తూ రాజకీయం చేయడమే కూటమి ప్రభుత్వానికి, చంద్రబాబుకు అలవాటు అన్నారు.

చంద్రబాబు బాధ్యత వహించాలి

కొన్ని రోజులుగా రాష్ట్రంలో జరుగుతున్న సంఘటనలపై చంద్రబాబు బాధ్యత వహించాల్సి వస్తుందని తెలిపారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇంటి వద్ద అగ్ని ప్రమాదం, ప్రత్యేకంగా సీసీ కెమెరాల ఏర్పాటు, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాకపోకలు తెలుసుకోవాలనే దురుద్దేశంతో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం, ఇలాంటి వ్యవహారాలపై, భవిష్యత్తులో ఏ సంఘటనలు జరిగినా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు బాధ్యత వహించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. అలాగే జరిగిన సంఘటనలపై, ఈనాడు పేపర్‌లో వచ్చిన వార్తలపై అన్ని జిల్లాలలో పరువునష్టం దావా వేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి, శివారెడ్డి, మందల నాగేంద్ర, పెనుబాల నరేష్, ఆర్‌పీ రమణ, వెంకటరెడ్డి, శ్రీధర్, కొరముట్ల శేఖర్, డివి రమణ, రాజారావు పాల్గొన్నారు.

గీత కులాల మద్యం దుకాణాల లైసెన్సుల జారీ

లాటరీ పద్ధతిలో కేటాయింపు ప్రక్రియ నిర్వహించిన కలెక్టర్



మద్యం దుకాణాల ధ్రువీకరణపత్రాలు అందజేస్తున్న కలెక్టర్ శ్రీధర్

రాయచోటి : కల్లుగీత కులాలకు సంబంధించి జిల్లాలో కేటాయించిన 11 మద్యం దుకాణాలకు లాటరీ పద్ధతిలో లైసెన్సు జారీ కేటాయింపు ప్రక్రియను పూర్తి చేసినట్లు జిల్లా కలెక్టర్ ఛామకూరి శ్రీధర్ పేర్కొన్నారు. సోమవారం రాయచోటి కలెక్టరేట్‌లో జిల్లా ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో కల్లుగీత కులాలకు సంబంధించి జిల్లాకు ప్రకటించిన మద్యం దుకాణాలకు లైసెన్సు జారీ నిమిత్తం దరఖాస్తు చేసుకున్న వారిపేర్లను కలెక్టర్ లాటరీ తీశారు. లాటరీలో ఎంపికైన వారికి మద్యం దుకాణాల లైసెన్సు పత్రాలను ఆయన అందజేశారు. ఈ మేరకు జిల్లాలో 11 షాపులకుగాను మొత్తంగా 135 మంది దరఖాస్తు చేసుకున్నారన్నారు. కల్లుగీత సామాజిక వర్గంలో ఉపకులాలైన గౌడ్, ఈడిగ, గౌడ, గౌండ్ల అను నాలుగు ఉప కులాలకు బహిరంగంగా లాటరీ పద్ధతిలో ఎంపిక చేయడం జరిగిందన్నారు. రాయచోటి, మదనపల్లి, రాజంపేట మున్సిపాల్టీలు, అలాగే మండలాలకు ఈ 11 దుకాణాలు కేటాయించినట్లు తెలిపారు. ఈ ప్రక్రియ పారదర్శకంగా బహిరంగంగా ఆ వర్గాలకు సంబంధించి దరఖాస్తు చేసుకున్న ప్రతినిధుల సమక్షంలో వీడియో గ్రఫీ చేస్తూ లాటరీ నిర్వహించామని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ సూపరిటెండెంట్ జి.మధుసూదన్, సహాయ సూపరిటెండెంట్ వై. జోగేంద్ర, ఇన్‌స్పెక్టర్ యల్లయ్య, దరఖాస్తుదారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు సత్వరం పరిష్కరించాలి

ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా వచ్చే ప్రజల సమస్యలకు సత్వరం పరిష్కార మార్గం చూపాలని జిల్లా కలెక్టర్ ఛామకూరి శ్రీధర్ అధికారులను ఆదేశించారు. రాయచోటి కలెక్టరేట్‌లోని పీజీఆర్‌ఎస్ హాలులో కలెక్టర్ అధ్యక్షతన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా అందిన ప్రజల సమస్యలను అత్యంత ప్రాధాన్యతతో బాధ్యతగా పరిష్కరించాలని కలెక్టర్ సూచించారు. అనంతరం వివిధ సమస్యలతో వచ్చిన ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. వ్యయ ప్రయాసాలతో, సుదూర ప్రాంతాల నుంచి జిల్లా కేంద్రం రాయచోటికి వచ్చిన అర్జీదారులకు జిల్లా కలెక్టర్ స్నాక్స్, వాటర్ బాటిల్స్, టీ సౌకర్యాలను కల్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంయుక్త కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్, డీఆర్‌ఓ మధుసూదనరావు, ఎస్‌డీసి రమాదేవి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

విలువలకు నీళ్లొదిలిన ఎమ్మెల్యే!

- స్వచ్ఛమైన నీటిపై మురికి రాజకీయం
- మొన్న వైఎస్సార్‌సీపీ నేత త్యాగరాజు వాటర్‌ప్లాంట్ కూల్చివేసేందుకు విఫలయత్నం
- నేడు దేవిరెడ్డి ఆదిత్య వాటర్‌ప్లాంట్‌తో పాటు మరోదానికి సీల్
- నిబంధనలను 'గంగ'పాలు చేస్తున్న ఎమ్మెల్యే.. నగరపాలకాధికారి



కో ఆపరేటివ్ కాలనీలోని వైఎస్సార్ ప్యూరిఫైడ్ వాటర్‌ప్లాంటుకు సీల్ వేసిన దృశ్యం

కడప టాస్క్‌ఫోర్స్ (వైఎస్‌ఆర్ జిల్లా) : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి కడప నగరంలో కక్షపూరిత రాజకీయాలకు తెరలేచింది. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలే లక్ష్యంగా ఈ దాడులు,దౌర్జన్యాలు సాగుతున్నాయన్న విమర్శలున్నాయి. ప్రజలకు శుద్ధి చేసిన నీటిని అందించాలన్న లక్ష్యంలో గతంలో తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉన్నప్పుడు ఎన్‌టీఆర్ సుజల స్రవంతి పథకం ద్వారా ఎంపీ నిధులు, ఏపీఎండీసీ నిధులను వెచ్చించి నగరంలో సుమారు 10 వాటర్‌ప్లాంట్లు నిర్మించారు. వాటి ద్వారా పేదలు నివాసం ఉన్నచోట రూ.5లకే క్యాన్ శుద్ధి చేసిన నీటిని అందించేవారు. కాలానుగుణంగా అందులో కొన్ని ప్లాంట్లు మూతబడ్డాయి. మరికొన్ని కొనసాగుతున్నాయి. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక వాటి పేరు వైఎస్సార్ ప్యూరిఫైడ్ వాటర్‌ప్లాంట్లుగా మార్చారే తప్పా మూసివేయించలేదు. వీటివల్ల పేదలకు సురక్షిత నీరు అందుతుండటమే ఇందుకు కారణంగా చెబుతున్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 8 నెలల తర్వాత ఆ వాటర్ ప్లాంట్లపై అధికార పార్టీ నేతలు కన్నేశారు. వాటిని ఎలాగైనా మూసివేయించాలని, తద్వారా వాటిని నడుపుతున్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తల ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీయాలని పథక రచన చేసినట్లు సమాచారం. ఇందులో భాగంగానే మొన్న మాసాపేటలో వైఎస్సార్‌సీపీ 26వ డివిజన్ ఇన్‌చార్జి త్యాగరాజు తన సొంత స్థలంలో ఏర్పాటు చేసుకున్న వాటర్‌ప్లాంటును కూల్చివేసేందుకు నగరపాలక అధికారులు రోజంతా కాచుక్కూర్చున్నారు. కానీ వారి ప్రయత్నాలు సాగలేదు. తాజాగా పాతశాలల్లో వాటర్‌ప్లాంట్లు నడుపుతున్నారనే కారణంతో కో ఆపరేటివ్ కాలనీలోని వైఎస్సార్ ప్యూరిఫైడ్ వాటర్‌ప్లాంట్, ఆకుల వీధిలోని మరొక వాటర్‌ప్లాంటును అధికారులు సీజ్ చేయడం కలకలం రేపుతోంది. చెమ్ముమియ్యాపేటలోని ఇంకో వాటర్ ప్లాంటును కూడా మూసివేయించేందుకు అధికారులు యత్నించినప్పటికీ న్యాయస్థానం ఆదేశాలతో దాని జోలికిపోనట్లు సమాచారం. కడప ఎమ్మెల్యే, టీడీపీ జిల్లా ముఖ్యనేత ఆదేశాల మేరకే ఈ వ్యవహారమంతా సాగుతున్నట్లు కడప నగరం కోడై కూస్తోంది. అధికార పార్టీ నేతల ఆదేశాలకు నగరపాలక ముఖ్య అధికారి తానా అంటే తందానా అంటూ వత్తాసు పలుకుతున్నట్లు అర్థమవుతోంది. ఈ వాటర్ ప్లాంట్ల ద్వారా పేదలకు సురక్షిత నీరు అందించడమేగాక నగరపాలక సంస్థకు కూడా కొంత ఆదాయం సమకూరుతోంది. దీనికి గండికొట్టేలా అధికార పార్టీ నాయకులు వ్యవహరిస్తున్నారని పలువురు విమర్శిస్తున్నారు. వైఎస్సార్‌సీపీ నాయకుల ఆర్థిక మూలాలను దెబ్బతీస్తున్నామనే భ్రమలో వారు పేదల నోటికాడి నీరు లాగేస్తున్నారన్న సత్యాన్ని మరుస్తున్నారని వారు పేర్కొంటున్నారు. అన్ని అనుమతులు ఉన్నప్పటికీ ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి నిధులతో నిర్మించారన్న ఏకైక కారణంతో వీటిని మూయించాలని స్కెచ్ వేసినట్లు చెబుతున్నారు.

ఎజెండాలో చేర్చేందుకు కమిషనర్ ససేమిరా...

వాటర్‌ప్లాంట్లను ఈ ఏడాది కూడా కొనసాగించడానికి మేయర్, నగరపాలకవర్గం చేసిన ప్రయత్నాలకు కమిషనర్ అడ్డుకట్ట వేసినట్లు తెలుస్తోంది. టేబుల్ ఎజెండాగా ఆ అంశాలను స్టాండింగ్ కమిటీ ముందుకు తీసుకురాగా, కమిషనర్ వాటిని ఎజెండాలో చేర్చేందుకు అంగీకరించలేదని సమాచారం. గతంలో ఎన్నడూ ఇలాంటి పరిస్థితి లేనట్లు తెలుస్తోంది. నగరపాలకవర్గంలోని సభ్యులు ఏ విషయంపై ఫిర్యాదు చేసినా కమిషనర్ వాటిని ఎజెండాలో చేర్చి చర్చించేందుకు పాలకవర్గానికి అవకాశమివ్వాలి. కానీ ఇక్కడ అందుకు విరుద్ధంగా జరుగుతున్నట్లు తెలుస్తోంది.

వేద, బడుగు, బలహీన వర్గాలు శుద్ధి చేసిన నీటిని తాగకూడదా?

పేదలు, బడుగు, బలహీన వర్గాల ప్రజలు శుద్ధి చేసిన నీటిని తాగకూడదా...ఈ ప్లాంటు ఒక వ్యక్తికి ఇవ్వలేదు. ప్రజలకు సేవ చేస్తున్నారనే కారణంతో ఒక ఆర్గనైజేషన్‌కు ఇచ్చారు. దాని ద్వారా పేదలకు రూ.5లకే క్యాన్ నీటిని అందిస్తుంటే మీకెందుకు బాధ. పేరుకే పాతశాలగానీ...గతంలో ఈ బిల్డింగ్‌లో శానిటేషన్ మెటీరియల్ ఉంచేవారు. దళితులు, బీసీ వర్గాలకు తాగునీరు ఇస్తుంటే జీర్ణించుకోలేకపోతున్నారు. కడపలో ఎన్నడూ ఇలాంటి సంస్కృతి లేదు. కక్షపూరిత రాజకీయాలకు ఇది పరాకాష్ట.

– దేవిరెడ్డి ఆదిత్య, జిల్లా అధ్యక్షుడు, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం

తెలుగు యువత అధ్యక్షుడిపై దాడికి యత్నం

మదనపల్లెలో కలకలం



యూ ట్యూబ్ కార్యాలయం వద్ద ఉన్న తెలుగు యువత అధ్యక్షుడు చినబాబు వర్గీయులు

మదనపల్లె : తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరాం చినబాబుపై సోమవారం రాత్రి టీడీపీకి చెందిన కొందరు వ్యక్తులు దాడికి యత్నించారు. ఈ ఘటన మదనపల్లె పట్టణంలో కలకలం రేపింది. మదనపల్లె పట్టణం రామారావుకాలనీలోని యూట్యూబ్ చానల్ ఇంటర్వ్యూకి వెళ్లిన శ్రీరాం చినబాబుపై.. టీడీపీకి చెందిన కొందరు వ్యక్తులు దాడి చేసేందుకు వెళ్లారు. ఈ విషయాన్ని తెలుసుకున్న శ్రీరాంచినబాబు తన అనుచరులను అక్కడికి చేరుకోవాల్సిందిగా ఆదేశించారు. దీంతో ఇరువర్గాలకు చెందిన వ్యక్తులు ఒక్కసారిగా యూట్యూబ్ చానల్ కార్యాలయం ఎదుట గుమికూడటంతో ఉద్రిక్తత వాతావరణం చోటు చేసుకుంది. విషయం తెలుసుకున్న టూటౌన్ పోలీసులు రంగ ప్రవేశం చేసి అల్లరి మూకలను చెదరగొట్టి పంపేశారు. మదనపల్లె టీడీపీ ఎమ్మెల్యే షాజహాన్‌బాషా వర్సెస్ చినబాబు మధ్య జరుగుతున్న అంతర్గత పోరు పార్టీ ప్రతిష్టతను దిగజారుస్తోందని నాయకులు, కార్యకర్తలు ఆవేదన చెందుతున్నారు. టీడీపీ అధిష్టానం వీరి ఇరువురి వ్యవహారంపై సీరియస్ అయినట్లు సమాచారం.

క్లుప్తంగా

'నా భూమికి రక్షణ కల్పించండి'



కలెక్టర్ శ్రీధర్ చామకూరికి అర్జీ అందజేస్తున్న ఇజాముద్దీన్

రాయచోటి : తన భూమికి రక్షణ కల్పించాలని సోమవారం గ్రీవెన్స్‌సెల్‌లో అన్నమయ్యజిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరికి ఇజాముద్దీన్ విన్న వించుకున్నాడు. మండల పరిధిలోని ఎస్.సోమవరం గ్రామం దేవళంపేటకు చెందిన ఇజాముద్దీన్ సర్వే నంబర్లు 338–12 బీలో 57 సెంట్లు, 338–12 సీ లో 57 సెంట్లు ఎన్నో సంవత్సరాలుగా పొలం సాగు చేసుకుంటున్నాడు. తమ వద్ద అన్ని ఆధారాలు ఉన్నప్పటికి అదే గ్రామానికి చెందిన ఒక ఒక వ్యక్తి తన భూమి దగ్గరకు వచ్చి రౌడీయిజం చేస్తూ ఆ భూమిని కాజేయాలని చూస్తున్నాడని కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. తనకు న్యాయం చేయాలని వేడుకున్నారు.

రెండు ద్విచక్రవాహనాలు ఢీకొని ఒకరి మృతి



మహబూబ్‌బాషా (ఫైల్)

పీలేరు రూరల్ : రెండు ద్విచక్రవాహనాలు ఢీకొని ఒకరు మృతి చెందిన సంఘటన సోమవారం ఉదయం మండలంలో చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. కేవీపల్లె మండలం సొరకాయలపేటకు చెందిన ఎస్.మహబూబ్‌బాషా (37) ద్విచక్రవాహనంలో ఆదివారం రాత్రి స్వగ్రామానికి బయలుదేరాడు. తలపులకు చెందిన హరిబాబు ద్విచక్ర వాహనంలో పీలేరుకు వస్తుండగా, పీలేరు రాయచోటి జాతీయ రహదారి ముదుపు వేముల వద్ద రెండు ద్విచక్రవాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో మహబూబ్‌బాషా అక్కడికక్కడే మృతి చెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

గోతిలో పడిన గుర్తు తెలియని వాహనం



గాలివీడు : మండలంలోని గోరాన్ చెరువు పరిధి గుట్ట క్రాస్ ఆంజనేయ స్వామి ఆలయం వద్ద ఓ కారు గోతిలో పడి ఉంది. కారు కొత్తగా ఉన్నప్పటికీ తలకిందులుగా పడి వాహనం ముందువైపు అద్దాలు ధ్వంసమయ్యాయి. అయితే ఆ వాహనం ప్రమాదవశాత్తు పడిపోయిందా లేక ఉద్దేశపూర్వకంగా గోతిలో పడేశారా అనే విషయం తెలియాల్సి వుంది. ఇదే విషయమై స్థానికులను ఆరా తీయగా గత పదిహేను రోజులుగా ఆ కారు అలాగే పడి ఉందని తెలిపారు. అనుమానాస్పదంగా ఉన్న కారు ప్రధాన రహదారి పక్కనే ఉండటంతో అటువైపుగా వెళ్లే వారు పలు సందేహాలు వ్యక్తం చేస్తున్నారు.

రైతుపై కక్ష.. పంటపై తీర్చుకున్నారు

కర్బూజా, బీర పంటలకు నష్టం కలిగించిన దుండగులు



డీజిల్ పిచికారితో దెబ్బతిన్న కర్బూజా తోటలో రైతు రెడ్డయ్య

రాయచోటి : అప్పులు చేసి, భార్య పుస్తెలు తెగనమ్మి, సాగుచేసిన పంట కోసం ఇంటిల్లిపాది ఎదురు చూస్తున్నారు. ఆరుగాలం కష్టపడి మంచి దిగుబడి వస్తుందనుకుంటున్న తరుణంలో కొందరు దుండగులు డీజిల్ పోసి పంటకు నష్టం కలిగించారు. ఫలితంగా నాలుగు ఎకరాలలో సాగైన కర్బూజ, బీర పంటలు చేతికందకుండా పోయాయి. ఈ దారుణ సంఘటన మాసాపేట పాత గొల్లపల్లిలో చోటు చేసుకుంది. పాత గొల్లపల్లికి చెందిన గొల్లపల్లి రెడ్డయ్య గృహ నిర్మాణ రంగంలో బెల్దారిగా జీవనం సాగిస్తున్నాడు. కూటమి ప్రభుత్వం వచ్చాక నిర్మాణ రంగం కుదేలవడంతో వ్యవసాయంపై దృష్టి సారించాడు. మాసాపేటకు చెందిన రైతు పొలాన్ని ఎకరా రూ. 30 వేలు వంతున గుత్తకు తీసుకొని మూడు ఎకరాలలో కర్బూజా, ఒక ఎకరంలో బీర పంటను సాగు చేశాడు. రెండు రకాల పంట సాగుకోసం ఇప్పటి వరకు రూ. 7 లక్షలు అప్పు చేశాడు. పంట ఏపుగా పెరిగి రెండు కిలోల నుంచి ఐదు, ఆరు కిలోల వరకు పెరిగిన కర్బూజా కాయలతో ఉన్న తోటను చూసి కక్షను పెంచుకున్న కొంతమంది దుండగులు పంట నాశనానికి ఒడిగట్టారు. వాటర్ బాటిళ్ల సాయంతో డీజిల్ తెచ్చి నీరు అందించే డ్రిప్పు పరికరాల పంపులో వేశారు. దీంతో నీళ్ల ద్వారా తోటంతా వెళ్లిన డీజిల్ ద్రావకాన్ని పీల్చిన పంట మొత్తం ఎండు దశకు చేరుకుంటోంది. దిగుబడిగా ఉన్న కాయలు పనికిరాకుండా పోతున్నాయి. దీంతో పంట చేతికందే సమయంలో నేలపాలు కావడంతో కన్నీరు మున్నీరుగా బాధిత రైతు రెడ్డయ్య విలపిస్తున్నాడు.

బీరపంట కూడా..

నాలుగు రోజుల క్రితం ఎకరం పొలంలో సాగు చేసిన బీర పంటను కూడా డీజిల్ పోసి నాశనం చేశారు. నీటి పంపులకు ఏర్పాటు చేసిన డ్రిప్‌లలో డీజిల్ పోసి పంట పూర్తిగా కాల్చేశారని బాధిత రైతు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నాడు.

ఉలవ పంటకు నిప్పు



ఉలవ పంట కాలిపోతున్న దృశ్యం

లక్కిరెడ్డిపల్లి : మండల కేంద్రంలోని దండేవాళ్ల పల్లె గ్రామానికి చెందిన పెద్దవీటి వెంకటేష్, రవికుమార్, నాగేశ్వర్, చంద్రశేఖర్ అనే రైతులు దాదాపుగా 16 ఎకరాలు ఉలవ పంటను సాగు చేశారు. కోసిన ఉలవ పంటను కళ్లంలో వేసి ఉండగా గుర్తు తెలియని వ్యక్తులు ఆదివారం రాత్రి నిప్పంటించారు. పెద్దవీటి వెంకటేష్ అగ్నిమాపక సిబ్బందికి ఫోన్‌లో సమాచారం ఇవ్వగా అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకొని పంటలను అదుపు చేసే ప్రయత్నం చేశారు. అప్పటికే ఉలవ పంట పూర్తిగా అగ్నికి ఆహుతైందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. రూ.5 లక్షల పైబడి నష్టం వాటిల్లిందని రైతులు లబోదిబో మంటున్నారు.

వేరుశనగ పంటపై అడవి పందుల దాడి



వేరు శనగ పంట పొలాన్ని పరిశీలిస్తున్న అటవీశాఖ సిబ్బంది

సుండుపల్లె : మండల పరిధిలోని మాచిరెడ్డిగారిపల్లి గ్రామ పంచాయతీ బండివాండ్లపల్లెకు చెందిన పి.స్వర్ణలత సాగు చేసిన వేరుశనగ పంట పొలంపై రాత్రి సమయంలో అడవి పందులు దాడి చేశాయి. ఈ మేరకు బాధిత రైతు అటవీశాఖ అధికారులకు సమాచారం ఇచ్చాడు. ఫారెస్టు రేంజర్ చంద్రశేఖర్ రెడ్డి ఆదేశాల మేరకు అటవీశాఖ బీట్ సిబ్బంది వెంకటరమణ, వ్యవసాయశాఖ సహాయకుడు రెడ్డి నాయక్ పంట పొలాన్ని పరిశీలించారు.

అన్నం కోసం వెళ్లి అసువులు బాసింది



రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన తిమ్ములమ్మ

సంబేపల్లె : ఆమెది రెక్కాడితే గాని డొక్కాడని జీవితం. కడుపు నింపుకునేందుకు కాసింత అన్నం మెతుకుల కోసం కూతురుతో కలిసి కూలీ నాలి చేసుకుంటూ బతుకీడుస్తోంది. ఈ అన్నం కోసమే ఆశగా రోడ్డు దాటుతున్న ఆ వృద్ధురాలిని వాహనం ఢీకొంది. ఆకలి తీర్చుకోకుండా ఆమె ప్రాణం అనంతవాయువుల్లో కలిసిపోయింది. ఈ విషాద ఘటన హృదయమున్న ప్రతి ఒక్కరిని కలచివేసింది.

చిత్తూరు– కర్నూలు జాతీయ రహదారిపై సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో జరిపిటి తిమ్ములమ్మ (77) అనే వృద్ధురాలు మృతి చెందింది. పోలీసుల వివరాల మేరకు మండల పరిధిలోని కడియాలవాండ్లపల్లె క్రాస్ సమీపంలో చిన్న గుడిసె వేసుకొని తిమ్ములమ్మ, ఆమె కూతురు కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగించేవారు. ఈ క్రమంలోనే ఆళ్లగడ్డకు చెందిన సుబ్రమణ్యం అనే వ్యక్తి , వారి కుటుంబ సభ్యులతో కలిసి అరుణాచలం నుంచి సొంత గ్రామానికి వెళుతున్నాడు. సంబేపల్లె మండల పరిధిలోని కడియాలవాండ్లపల్లె క్రాస్ సమీపంలో కారు నిలిపి భోజనం చేశారు. ఈ క్రమంలో భోజనం మిగలడంతో సమీపంలో ఉన్న తిమ్ములమ్మను పిలిచారు. ఆమె జాతీయ రహదారి దాటుతుండగా పీలేరు వైపు నుంచి వస్తున్న ఐచర్ వాహనం ఆమెను ఢీకొంది. తిమ్ములమ్మ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయింది. కాగా ఆమెతో పాటు రోడ్డు దాటుతున్న సుబ్రమణ్యం కూడా గాయపడటంతో అతన్ని చికిత్స నిమిత్తం రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సంఘటన స్థలాన్ని సంబేపల్లె పోలీసులు పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

భూ ఆక్రమణలపై విచారణ



విచారణ నిర్వహించిన తహసీల్దార్ భీమేశ్వర్‌రావు

పీలేరు రూరల్ : పీలేరు మండలంలోని తలపుల పంచాయతీలో భూ ఆక్రమణలపై తహసీల్దార్ భీమేశ్వర్‌రావు ఆధ్వర్యంలో రెవెన్యూ అధికారులు విచారణ చేపట్టారు. గ్రామానికి చెందిన ఇరగంరెడ్డి మురళీమోహన్‌రెడ్డి తలపుల గ్రామ పంచాయతీ ముంతావాండ్లపల్లెలో జరిగిన భూ ఆక్రమణలపై రాష్ట్ర స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఆర్.పి. సిసోడియాకు గత నెల 27న ఫిర్యాదు చేశాడు. దీంతో ఆయన ఆదేశాల మేరకు సోమవారం జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదేశాలతో తహసీల్దార్ సంఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. సుమారు 15 ఎకరాలు ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురైనట్లు గుర్తించినట్లు తహసీల్దార్ తెలిపారు. ఈ నివేదికను జిల్లా ఉన్నతాధికారులకు పంపనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్వేయర్ కిరణ్మయి, వీఆర్‌ఓ అజయ్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

అనారోగ్యంతో రైతు ఆత్మహత్య

మదనపల్లె : అనారోగ్యంతో మనస్తాపం చెంది రైతు ఆత్మహత్య చేసుకున్న సంఘటన సోమవారం చిత్తూరు జిల్లా పుంగనూరు మండలంలో జరిగింది. రాజులూరుకు చెందిన రైతు గోవిందరాజు(55) వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నాడు. అయితే, గత కొంతకాలంగా తనతోపాటు భార్య అనారోగ్యంతో బాధపడుతుండటంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆస్పత్రులకు వెళ్లి చికిత్స పొందినా ఫలితం లేకపోవడంతో మనస్తాపం చెంది ఇంటివద్దే పురుగుమందు తాగాడు. గమనించిన స్థానికులు మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. అత్యవసర విభాగంలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి గోవిందరాజు మృతి చెందాడు. పుంగనూరు పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

మద్యం సేవించి విధులకు హాజరయ్యారని ఫిర్యాదు

పీలేరు : స్థానిక ప్రభుత్వ ఆస్పత్రి సెక్యూరిటీ సిబ్బంది మద్యం సేవించి విధులకు హాజరయ్యారని, వారికి ఓ డ్యూటీ డాక్టర్ వత్తాసు పలికారని, వారిద్దరిపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎస్‌యూఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మద్దెల అమృత్‌తేజ డిమాండ్ చేశారు. సోమవారం ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ చంద్రశేఖర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు సాయిసంపత్‌కుమార్, నాయకులు ఇమ్రాన్, యశ్వంత్, సురేష్, హరి తదితరులు పాల్గొన్నారు.

కారు ఢీకొని తండ్రీ కొడుకులకు గాయాలు



గాయపడిన రామాంజులు

బి.కొత్తకోట : కొడుకును పాఠశాలలో వదిలేందుకు బైక్‌పై వస్తున్న తండ్రి, కొడుకులను కారు ఢీకొన్న ఘటన సోమవారం మండలంలో జరిగింది. శ్రీ సత్యసాయి జిల్లా తనకల్లు మండలం పూలకుంటపల్లెకు చెందిన రామాంజులు(54) 8వ తరగతి చదువుతున్న కుమారుడు విష్ణుతేజతో కలిసి కురబలకోట మండలం చేనేతనగర్‌కు ములకలచెరువు మీదుగా వస్తున్నాడు. మండలంలోని కనికలతోపు వద్దకు రాగానే ఎదురుగా వస్తున్న కారును బైక్ ఢీకొంది. ఘటనలో రామాంజులు ఎడమకాలు విరిగి గాయపడ్డాడు. విష్ణుతేజకు స్వల్ప గాయాలయ్యాయి. బాధితులను 108లో మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు.

దళిత యువకుడిపై దాడికేసు విచారణ

రామసముద్రం : మండలంలోని ఆర్.నడింపల్లె దళితవాడకు చెందిన ఎస్.పవన్‌పై బల్లసముద్రంకు చెందిన నవీన్, అతని బావమరుదులు(కర్నాటక వాసులు) గడ్డివాము విషయంలో ఫిబ్రవరి 2న దాడి చేశారు. ఈ విషయమై నవీన్, అతడి బావమరుదులపై ఎస్సీ,ఎస్టీ కేసు పెట్టారు. ఎస్ఐ రవికుమార్ దాడి జరిగిన స్థలానికి వెళ్లి సోమవారం విచారణ చేపట్టారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు రాజేష్, ఎమ్మెస్పీ మండల అధ్యక్షుడు సుధాకర్, ఉపాధ్యక్షులు భాస్కర్, బయప్ప, బాధిత కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

తిరుపతి నుంచి షిర్డికి రైలు సౌకర్యం కల్పించాలి

- చెన్నై–అహ్మదాబాద్–చెన్నై రైళ్లు కడపలో ఆపాలి
- యురేనియం గ్రామాల రైతుల సమస్యలు పరిష్కరించాలి
- కేంద్ర మంత్రులను కోరిన ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి



కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న ఎంపీ

కడప సెవెన్‌రోడ్స్ : ప్రజల సౌకర్యం కోసం తిరుపతి–షిర్డికి నేరుగా రైలు సౌకర్యం కల్పించడంతోపాటు చెన్నై–అహ్మదాబాద్ మధ్య తిరుగుతున్న రైళ్లను కడప స్టేషన్‌లో ఆగేలా చర్యలు తీసుకోవాలని కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి సోమవారం కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌ను కోరారు. అలాగే వేముల మండలంలోని యురేనియం ప్రభావిత గ్రామాల రైతులు కొన్ని ఏళ్లుగా ఎదుర్కొంటున్న భూ సేకరణ, ఉద్యోగ అవకాశాల కల్పన వంటి సమస్యలు పరిష్కరించాలని కేంద్ర అణుశక్తిశాఖ సహాయమంత్రి డాక్టర్ జితేంద్రసింగ్‌కు విన్నవించారు.

తిరుపతి, షిర్డి పుణ్యక్షేత్రాలను లక్షలాది మంది భక్తులు సందర్శిస్తుంటారు. తిరుపతి–షిర్డి మధ్య వారానికి ఒకసారి రైలు సౌకర్యం ఉంది. ఈ రైలు ద్వారా తిరుపతి నుంచి షిర్డి వెళ్లడానికి ఇరవై ఆరున్నర గంటల సమయం పడుతోంది. షిర్డి వెళ్లేందుకు మరో ప్రత్యామ్నాయ సౌకర్యం లేనందువల్ల భక్తులు 1400 కిలోమీటర్లు ప్రయాణించాల్సి వస్తోంది. ప్రతిరోజు రైలు సౌకర్యం కల్పిస్తే ప్రయాణ సమయాన్ని, ఖర్చును చాలా వరకు తగ్గించవచ్చు. అలాగే షిర్డికి 150 కిలోమీటర్ల పరిధిలోగల శని సింగనపూర్, నాసిక్, త్రయంబకేశ్వర, జ్యోతిర్లింగ వంటి పవిత్ర క్షేత్రాలకు కూడా వెళ్లేందుకు సౌకర్యవంతంగా ఉంటుంది. డైలీ డైరెక్ట్ ట్రైన్ సౌకర్యం వల్ల ఒంటిమిట్ట, దేవునికడప, కడప పెద్దదర్గా, గుంతకల్లులోని కసాపురం ఆంజనేయస్వామి దేవాలయం, మంత్రాలయంలోని శ్రీ రాఘవేంద్రస్వామి మఠం వంటి పుణ్యక్షేత్రాలను సందర్శించేందుకు అవకాశం లభిస్తుంది. కనుక తిరుపతి–షిర్డి మధ్య ప్రతిరోజు రైలు సౌకర్యం కల్పించేందుకు అవసరమైన చర్యలు తక్షణమే చేపట్టాలని వైఎస్ అవినాష్‌రెడ్డి కోరారు. అదేవిధంగా ప్రస్తుతం రైలు నెంబర్లు 22919/ 22920 చెన్నై–అహ్మదాబాద్–చెన్నై మధ్య వారానికి ఒకసారి చొప్పున నడుస్తున్నాయని తెలిపారు. కడప రైల్వేస్టేషన్‌లో ఇవి ఆగడం లేదన్నారు. అహ్మదాబాద్‌కు వెళ్లేందుకు ప్రయాణికులు రేణిగుంట లేదా గుంతకల్లుకు వెళ్లాల్సి వస్తోందన్నారు.

చట్ట పరిధిలో సమస్యలను పరిష్కరించాలి

జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు



బాధితుని సమస్యను వింటున్న జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు

రాయచోటి : చట్ట పరిధిలో ప్రజా సమస్యలను పరిష్కరించాలని జిల్లా పోలీసు యంత్రాంగాన్ని ఎస్పీ వి.విద్యాసాగర్ నాయుడు ఆదేశించారు. సోమవారం అన్నమయ్య జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో జిల్లా ఎస్పీ ఆధ్వర్యంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ఫిర్యాదుదారుల నుంచి అర్జీలను స్వీకరించి అర్జీదారులతో ముఖాముఖి మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. దివ్యాంగులు, వృద్ధులు, మహిళల ఫిర్యాదులకు మొదట ప్రాధాన్యతనివ్వాలన్నారు. సత్వరమే సమగ్ర విచారణ జరిపి, వారి సమస్యలను పరిష్కరిస్తామని ఎస్పీ తెలిపారు.

బాధితుని చెంతకు ఎస్పీ..

సమస్యను విన్నవించుకోవడానికి ఎస్పీ కార్యాలయానికి వచ్చిన దివ్యాంగుని వద్దకు ఎస్పీ విద్యాసాగర్ నాయుడు వెళ్లి ఆయన విన్నపాన్ని ఆలకించారు. పీలేరు మండలం తలుపుల భయారెడ్డిగారిపల్లికి చెందిన ఎర్రగుడి రవీంద్రనాథ్ రెడ్డి తన భూమి సమస్యపై ఎస్పీకి విన్నవించుకోవడానికి సోమవారం ఎస్పీ కార్యాలయానికి చేరుకున్నాడు. వైకల్యం అడ్డు రావడంతో మిద్దెపై ఉన్న ఎస్పీ దగ్గరకు వెళ్లడానికి ఇబ్బంది పడ్డాడు. విషయం తెలుసుకున్న ఎస్పీ తన కార్యాలయం నుంచి కిందకు వచ్చి బాధితుని సమస్యను విని చట్టపరిధిలో పరిష్కరించాలని పీలేరు సీఐను ఆదేశించారు.

మద్యం షాపు ఎలా నడుపుతారో చూస్తాం!

అధికార పార్టీలో అంతర్యుద్ధం

కురబలకోట : కల్లు గీత కార్మికుల మద్యం షాపుల కోసం సొంత పార్టీ నాయకులే తనకు బెదిరింపు కాల్స్ చేసి భయపెడుతున్నారని బాధితులు జిల్లా ఎస్పీకి సోమవారం ఫిర్యాదు చేశారు. తంబళ్లపల్లె మద్యం షాపు గీత కార్మికుల కింద అంగళ్లుకు చెందిన రఘు దక్కించుకున్నాడు. ఇతనితో కలసి అంగళ్లుకు చెందిన టీడీపీ నాయకుడు తోట అశోక్ సోమవారం రాయచోటిలో జిల్లా కలెక్టర్ నుంచి లైసెన్స్ పత్రాలు తీసుకున్నారు. ఇది తెలుసుకున్న నియోజక వర్గంలోని అధికార పార్టీకి చెందిన శంకర, విశ్వనాథరెడ్డి, మస్తాన్ రెడ్డి తమను ఫోన్‌లో మద్యం షాపు ఎలా నడుపుతారో చూస్తామని బెదిరించినట్లు వారు తెలిపారు. రాయచోటి మార్గంలో కారులో వెంబడించారన్నారు. తంబళ్లపల్లె నియోజకవర్గ ముఖ్య నాయకుడి ప్రమేయంతో వీరు బెదిరింపు కాల్స్ చేశారని తెలిపారు. వీరి నుంచి ప్రాణ హాని ఉందని జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. అనంతరం వారు రాయచోటి అర్బన్ పోలీసుల రక్షణతో కారులో సాయంత్రం అంగళ్లు చేరుకున్నారు. దీనిపై విచారణ జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.

అర్హులైన దళితులకు సాగుభూమి ఇవ్వాలి



కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న తిమ్మయ్యపల్లె దళితులు

రాయచోటి అర్బన్ : జిల్లాలో అర్హులైన దళిత కుటుంబాల వారికి 3 ఎకరాల చొప్పున సాగుభూమిని ఇవ్వాలని సీపీఐ రాయచోటి నియోజకవర్గ కార్యదర్శి శ్రీనివాసులు, తిమ్మయ్యపల్లె దళితవాడ ప్రజలు డిమాండ్ చేశారు. సోమవారం తమ గ్రామంలోని ప్రభుత్వ భూమిని తమకు పట్టాలుగా మంజూరు చేయాలంటూ సీపీఐ ఆధ్వర్యంలో వారు కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దళితవాడలోని 100 కుటుంబాలకు ఒక్కరికి కూడా సాగుభూమి లేదన్నారు. తమ పల్లె పక్కనే ఉన్న సర్వే నంబరు 293లో 200 ఎకరాలు ప్రభుత్వభూమిని తమకు పట్టాలుగా ఇవ్వాలని కోరారు. అనంతరం జేసీ ఆదర్శరాజేంద్రన్‌కు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో ఎస్సీ వర్గీకరణ కమిటీ జిల్లా నాయకుడు గంగాధర్, దళిత నాయకులు కృష్ణయ్య, శంకరయ్య, యశ్వంత్, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

గంజాయి స్వాధీనం



నిందితుల అరెస్టు చూపుతున్న సీఐ ప్రసాద్‌బాబు, ఎస్ఐ చంద్రశేఖర్

కలికిరి(వాల్మీకిపురం) : గంజాయి తరలిస్తున్న ఐదుగురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి 2.25 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు వాల్మీకిపురం సీఐ ప్రసాద్ బాబు తెలిపారు. పోలీసుల కథనం మేరకు.. పట్టణ పరిధిలో ప్రత్యేక నిఘా ఉంచి అనుమానితులను విచారిస్తుండగా పోలీసులను చూసిన మహిళ, ఐదుగురు వ్యక్తులు అనుమానాస్పదంగా చేతిలో ప్లాస్టిక్ కలిగి ఉండి పారిపోవడానికి ప్రయత్నించారు. సిబ్బంది అప్రమత్తమై వారిని అదుపులోకి తీసుకోగా వారి వద్ద 2.25 కిలోల గంజాయి ఉన్నట్లు గుర్తించారు. గంజాయితో పాటు ఐదు మొబైల్ ఫోన్‌లు, 20వేలు నగదు స్వాధీనం చేసుకున్నారు. వారిని విచారించగా పట్టణ పరిధిలోని సాకలవారిబండ ప్రాంతానికి చెందిన కాలపల్లి అంజమ్మ, ఇందిరమ్మకాలనికి చెందిన సయ్యద్ ఖలీల్, దయ్యాలబండకు చెందిన ఎస్.సమీర్, నమాజ్‌కట్ట వీధికి చెందిన నిమ్మనపల్లి కిరణ్, దయ్యాల బండకు చెందిన కత్తి సిద్దార్థగా గుర్తించారు. అంజమ్మ ఇతర ప్రాంతాల నుంచి గంజాయి తెప్పించి స్థానికులైన కొందరితో కలిసి విక్రయిస్తున్నట్లు విచారణలో వెల్లడైంది. నిందితులను కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించారు. నిందితులను పట్టుకోవడంలో ప్రతిభ చూపిన ఎస్ఐ చంద్రశేఖర్, ఏఎస్ఐ కరీముల్లా, హెచ్‌సీలు దస్తగిరి, వేణు, పీసీలు లక్ష్మీపతి, మధు, అబ్దుల్లా, రెడ్డిప్రసాద్, అనిత, హోంగార్డులు బాబాప్రసాద్, రిజ్వాన్‌లకు రివార్డుల కోసం ఉన్నతాధికారులకు నివేదించనున్నట్లు సీఐ తెలిపారు.

తెలుగు యువత అధ్యక్షుడిపై ఎస్సీ,ఎస్టీ కేసు నమోదు చేయాలి



సబ్ కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న మాలమహానాడు, ఆర్‌జీఎస్ నాయకులు

మదనపల్లె : టీడీపీ సీనియర్ నాయకుడు, తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరామ్ చినబాబుపై ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం(బీకేఎంయూ), మాలమహానాడు నాయకుడు గుండా మనోహర, రాష్ట్ర గిరిజన సమాఖ్య వ్యవస్థాపక అధ్యక్షుడు కోనేటి దివాకర్ డిమాండ్ చేశారు. సీటీఎం వీఆర్‌ఓ మునిస్వామి నాయక్ విధులకు తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరామ్‌చినబాబు ఆటంకం కలిగించడమే కాకుండా, అసభ్యపదజాలంతో దూషించడంపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ, సోమవారం సబ్ కలెక్టరేట్ ఎదుట నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. శ్రీరామ్ చినబాబు మైనింగ్‌శాఖ నుంచి ఎలాంటి అనుమతి లేకుండా మట్టి తరలిస్తున్నాడన్న ఫిర్యాదుపై వీఆర్‌ఓ మునిస్వామి నాయక్ విధి నిర్వహణలో భాగంగా టిప్పర్‌ను అడ్డుకుని వాహనాన్ని సీజ్ చేశాడన్నారు. దీనిపై శ్రీరామ్‌చినబాబు మందీమార్బలంతో వచ్చి వీరంగం సృష్టించడమే కాకుండా కులం పేరుతో అవమానపరుస్తూ, అసభ్య పదజాలాన్ని వినియోగించడం బాధాకరమన్నారు. అనంతరం ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు తోపుకృష్ణప్ప సబ్ కలెక్టర్ మేఘస్వరూప్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు.

కల్వర్టు పై నుంచి పడి వృద్ధుడి మృతి



కృష్ణప్ప (ఫైల్)

మదనపల్లె : కల్వర్టు పైనుంచి పడి వృద్ధుడు మృతి చెందిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. తాలూకా సీఐ కళావెంకటరమణ కథనం మేరకు.. పొన్నేటిపాలెం పంచాయతీ మొట్లపల్లికి చెందిన కృష్ణప్ప (70) కూలి పనులు చేసుకుని జీవనం సాగించేవాడు. ఇతను 5 రోజుల క్రితం రాత్రి మొట్లపల్లి సమీపంలోని కల్వర్టు వద్ద కింద పడిపోయి చనిపోయాడు. సోమవారం కల్వర్టు వద్ద దుర్వాసన వస్తుండటంతో గమనించిన స్థానికులు తాలూకా పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో తాలూకా ఎస్ఐ చంద్రమోహన్ సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. కుళ్లిన స్థితిలో మృతదేహం ఉండడంతో అక్కడే పోస్టుమార్టం నిర్వహించారు. మృతుడి కుమారుడు శంకర ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

ఆర్యవైశ్యుల సంక్షేమానికి ప్రత్యేక చర్యలు

రాష్ట్ర మంత్రులు టీజీ భరత్, మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి



వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారిని దర్శించుకున్న మంత్రులు టీజీ భరత్, మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

రాయచోటి టౌన్ : ఆర్యవైశుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి టీజీ భరత్, రవాణా, యువజన, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని గాంధీబజారులో వాసవీ కన్యకా పరమేశ్వరి దేవి ఆలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వంలో ఆర్యవైశ్యులకు ప్రత్యేక గుర్తింపు వచ్చిందన్నారు. వీరి అభివృద్ధి కోసం ప్రత్యేక నిధులు కేటాయించేందుకు ప్రభుత్వంతో చర్చిస్తామన్నారు. కూటమి ప్రభుత్వంలో అన్ని వర్గాలవారు సుఖసంతోషాలతో జీవిస్తున్నారని చెప్పారు.